క్లుప్తంగా

విజ్ఞానమేళాలో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు

భైంసాటౌన్: ఆదిలాబాద్‌లో నిర్వహించిన విభాగ్‌స్థాయి విజ్ఞాన మేళా పోటీల్లో భైంసాలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ కిసాన్‌గల్లి పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. శిశువర్గ వేదిక మ్యాచ్ క్విజ్ పోటీలో శివ, తపశ్రీ, వైష్ణవ్ బృందం ప్రథమ బహుమతి, కిషోర వర్గలో సాయిప్రియ, శ్రీనిక, తనుశ్రీ బృందం, కిషోర వర్గ సంస్కృతి జ్ఞాన పరీక్ష పోటీలో గగనశ్రీ, భూమిక, ఆరాధ్య బృందం, బాలవర్గలో శ్రీకర్, లక్ష్మణ్, శివకేశవ బృందం, గణిత మోడల్ సైన్స్ మోడల్ కిషోర వర్గలో అనూష, శ్రీజ ద్వితీయ బహుమతులు సాధించారు. అలాగే గుజిరిగల్లికి చెందిన విద్యార్థులు సైతం ప్రతిభ చూపి బహుమతులు గెలుపొందారు. దీంతో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎంలు భోజన్న, గంగాధర్, ప్రబంధకారిణి సభ్యులు నాగేశ్, శివకుమార్, డి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

కోదండరామ్‌ను కలిసిన ఉద్యమకారులు



పుస్తకం అందిస్తున్న ఫోరం నాయకులు

భైంసాటౌన్: టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ముధోల్ నియోజకవర్గ ఉద్యమకారుల చరిత్ర పుస్తకం రూపొందించగా, ఈ మేరకు ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల గురించి పుస్తకరూపంలోకి తేవడంపై అభినందించారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకాల రాంచందర్, భరత్, వినయ్, శ్రీనివాస్, పుస్తక రచయితలు పుండ్లిక్‌రావు, జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

సీసీ రోడ్లు, డ్రైయినేజీలకు రూ.5 కోట్ల నిధులు

నిర్మల్‌రూరల్: నియోజకవర్గంలో సీఆర్‌ఆర్, ఎస్‌సీపీ గ్రాంట్ ద్వారా ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలకు రూ.5 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మల్‌రూరల్ మండలం న్యూపోచంపాడ్, అనంతపేట, కౌట్ల(కే), భాగ్యనగర్, సారంగాపూర్ మండలం గోడిసెర, కంకేట, నారాయణపల్లె, వైకుంఠపూర్, వంజర్, నేతాజీనగర్, లక్ష్మణచాంద మండలం బోరెగావ్, కంజర్, చింతలచంద, చామన్‌పల్లి, తీర్వెల్లి, మామడ మండలం టెంబుర్ని, ఆదర్శనగర్, న్యూలింగంపల్లి, దిలావర్‌పూర్ మండలం కంజర్, కదిలి గ్రామాలకు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

గంగపుత్రులకు సన్మానం



సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి, పార్‌పెల్లితండా గ్రామాల గేదెలు ఈనెల 27న గోదావరి మధ్యలో కుర్రుకు మేతకు వెళ్లి మధ్యాహ్నం నీటి ప్రవాహం పెరిగి అక్కడే చిక్కుకున్నాయి. ఆరు రోజుల తర్వాత మునిపెల్లికి చెందిన ఐదుగురు గంగపుత్రులు సోమవారం గోదావరిలో తెప్పల సాయంతో కుర్రు వద్దకు చేరుకుని 300 గేదెలను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. మంగళవారం మునిపెల్లిలో గంగపుత్రులు బొడ్డు ఆశన్న, పల్లికొండ శ్రీనివాస్, చిన్న సాయన్న, సాయన్న, రాములును గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. గోదావరిలో చిక్కుకుపోయిన గుగ్లావత్ శంకర్‌ను రక్షించడానికి వచ్చిన జాతీయ, రాష్ట్రవిపత్తు నివారణ, రక్షణ బృందాలకు వంటచేసి భోజనం పెట్టిన అబ్బడి లింగవ్వను సత్కరించారు. మునిపెల్లి వీడీసీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన మాఅమ్మ–నాన్న ఫౌండేషన్ చైర్మన్ మాదిరి ఆంజనేయులు తల్లి, లోకేశ్వరంలోని యశ్వంత్‌రావు తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను కేంద్రమాజీమంత్రి వేణుగోపాలాచారి మంగళవారం పరామర్శించారు. ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, నాయకులు కపిల్, భీంరావు, సుదర్శన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి ఉన్నారు.

కోర్కెలు తీర్చే భోసి వినాయకుడు

- 61 ఏళ్లుగా ఊరంతా ఒకే విగ్రహంతో ఉత్సవాలు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిత్యాన్నదానం



దర్శనం కోసం భక్తుల బారులు



కొలువుదీరిన వినాయకుడు

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో 61 ఏళ్లుగా కర్ర వినాయకుడు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా భక్తుల పూజలందుకుంటున్నాడు. ఏటా వినాయక చవితి సందర్భంగా విగ్రహాన్ని ప్రతిష్ఠించి, నిమజ్జనం చేయకుండా బావినీటితో పవిత్రం చేసి, గ్రామంలోని లక్ష్మీనారాయణ ఆలయంలో భద్రపరుస్తారు. మరుసటి ఏడాది ఉత్సవాలకు విగ్రహానికి రంగులు దిద్ది, పూజలు నిర్వహించడం గ్రామంలో సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ పూజలతో సిరిసంపదలు, సుఖసంతోషాలతో జీవిస్తున్నామని గ్రామస్తులు, భక్తులు విశ్వసిస్తారు.

పాలజ్ చరిత్రతో కూడిన విగ్రహం

కర్ర వినాయకుడి విగ్రహం మహారాష్ట్రలోని పాలజ్‌లో తయారైంది. 1963లో నిర్మల్‌కు చెందిన పోలకొండా గుండాజీ, అప్పటి గ్రామ సర్పంచ్ గంగాధర్, పోలీస్ పటేల్ సిద్దయ్యప్ప, గ్రామస్తులు కలిసి ఈ విగ్రహాన్ని రూ.51 చెల్లించి తెచ్చారు. గుండాజీ 11 రోజుల ఉపవాస దీక్షతో ఈ విగ్రహాన్ని రూపొందించినట్లు గ్రామస్తులు తెలిపారు. అప్పటి నుంచి ఈ విగ్రహాన్ని నిమజ్జనం చేయకుండా, రంగులుదిద్ది ఏటా ఘనంగా పూజిస్తున్నారు. మార్కెట్‌లో లభించే గణేశ్ విగ్రహాన్ని కర్ర వినాయకుడితోపాటు ప్రతిష్ఠించి, ఆ విగ్రహాన్ని మాత్రమే నిమజ్జనం చేస్తారు.

11 రోజుల ఆధ్యాత్మిక ఉత్సవం

కర్ర వినాయకుడి ప్రతిష్ఠాపన నుంచి 11 రోజులపాటు ఆలయంలో దత్తాత్రేయ సప్తాహం జరుగుతుంది. మధ్యాహ్నం గీత ప్రవచనాలు, రాత్రి కీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతాయి. ఉదయం, సాయంత్రం నిర్వహించే హారతి కార్యక్రమానికి తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు చేరుకుని మొక్కులు చెల్లించి, ముడుపులు కడుతున్నారు.

కాలినడకన వచ్చి..

తానూరు, భైంసా, ముధోల్‌తోపాటు మహారాష్ట్రలోని భోకర్, రాతి, తురాటి, నాందా గ్రామాల నుంచి భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకొని, భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ముడుపులు కట్టడం ద్వారా కోరికలు నెరవేరుతున్నాయని భక్తులు విశ్వసిస్తారు. విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం వంటి కోరికలు తీరుతున్నాయని చెబుతున్నారు.

ఒకే వినాయకుడితో గ్రామ ఐక్యత

చిన్న గ్రామాల్లో వీధులవారీగా వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే ఈ రోజుల్లో, భోసిలో ఒకే కర్ర వినాయకుడిని గ్రామస్తులంతా కలిసి పూజిస్తూ ఐక్యతను చాటుతున్నారు. ఈ పూజల వల్ల విద్యావంతుల సంఖ్య పెరుగుతూ, గ్రామస్తులు పట్టభద్రులవుతున్నారని నమ్ముతారు. గ్రామంలో 170 మందికి పైగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో ఉన్నారు. వ్యాపారంలోనూ గ్రామం ముందడుగు వేస్తోంది. కర్ర వినాయకుని మహిమతోనే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయని గ్రామస్తుల విశ్వాసం. గ్రామంలోని యువకులు గత పదేళ్లుగా గణపతి దీక్ష చేపడుతున్నారు. ఈ ఏడాది 30 మంది యువకులు దీక్ష తీసుకున్నారు. ఒకే వినాయకుడిని ప్రతిష్ఠించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నారు.

గ్రామస్తుల సహకారంతో

గ్రామస్తుల సాహకారంతో ఏటా ఆలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నాం. భక్తుల కొంగుబంగారంగా పిలవబడే కర్ర వినాయకుడి దర్శించుకుంటే కోరుకున్నది నెరవేరుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఏటా ఈ నమ్మకంతో వచ్చే భక్తులు పెరుగుతున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నాం. – ఉత్తం బాలేరావ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

ఘనంగా గణేశ్ నిమజ్జనం



నిమజ్జనోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల



భైంసా మండలం కుంసరలో గణేశ్ శోభాయాత్ర

ముధోల్/భైంసారూరల్/కుంటాల/తానూరు/లోకేశ్వరం: జిల్లాలో ఏడురోజుల పాటు పూజలందుకున్న గణపయ్యలను భక్తులు మంగళవారం చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. అందంగా ముస్తాబు చేసిన వాహనాల్లో ప్రతిమలను ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించారు. యువకులు, యువతి, నిర్వాహకుల నృత్యాల మధ్య నిమజ్జనానికి తరలించారు. ముధోల్‌లోని రామాలయం వద్ద వినాయకుడికి ఎస్పీ జానకీ షర్మిల, అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్ పూజలు చేసి నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. కాగా, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గణేశ్ లడ్డూను వేలంలో రూ.31వేలకు నర్సయ్య దక్కించుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కర్ర మోక్ష గణపతికి పూజలు

లోకేశ్వరం/ఖానాపూర్: లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్‌లో కర్ర మోక్ష గణనాథుడిని కేంద్రమాజీ మంత్రి వేణుగోపాలాచారి పూజలు చేశారు. అనంతరం ఆయన్ను గ్రామస్తులు సన్మానించారు. అదే విధంగా భైంసా శ్రీనయనం నృత్య అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. ఖానాపూర్ మండలంలోని గ్రామాల్లో మండపాల వద్ద అన్నదానాలు, కుంకుమపూజలు జరిగాయి.

శోభాయాత్ర మార్గం పరిశీలన

భైంసాటౌన్: పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్రలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం విద్యుత్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, శాఖల అధికారులతో కలిసి పట్టణంలో నిమజ్జన రూట్ పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్, డీఈఈ సంతోష్ ఉన్నారు. హిందూ ఉత్సవ సమితి, ఏఎంసీ గణేశ్ మండలి సంయుక్త ఆధ్వర్యంలో భైంసాలోని గాంధీగంజ్‌లో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. పాఠశాలలకు చెందిన 1008 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ సంఘ భవనంలో నిర్మల్ నగర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నిమజ్జన శోభాయాత్రలో ఏర్పడే ఇబ్బందులు నిర్వాహకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు మూర్తి ప్రభాకర్, గౌరవ అధ్యక్షుడు పతికే రాజేందర్, నాయకులు రాంనాథ్, మేడిసెమ్మ రాజు, అయ్యన్నగారి రాజేందర్, అర్జున్, కార్తీక్, సుంకరి సాయి, బిట్లింగ్ నవీన్, నరేందర్, శంకర్ పతి, గణేష్ పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

నర్సాపూర్(జి): గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని, ఎవరైన వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై గణేశ్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. ఇటీవల డీజే నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న ప్రత్యేక లైటింగ్

లక్ష్మణచాంద: వడ్యాల్‌లో మంగళవారం రాక్‌స్టార్ యూత్ వినాయక నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్ నుంచి రప్పించిన ప్రత్యేక లైటింగ్ ఆకట్టుకుంది. డీజేకు బదులు ఏర్పాటు చేసిన కార్యక్రమంతో గణేశ్ నిమజ్జనం చేశారు.

‘ఆది కర్మయోగి’తో గిరిజన అభివృద్ధి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆది కర్మయోగి పథకం ద్వారా గిరిజన అభివృద్ధి సాధ్యమని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని టీఎన్జీవో హాల్‌లో ఆది కర్మయోగి పథకం పరిధిలో మూడు రోజులపాటు జరిగే బ్లాక్ మాస్టర్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రతీ గిరిజన కుటుంబానికి చేరేలా సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు గిరిజనులకు అందినప్పుడే ఆర్థిక, సామాజిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ, సీపీవో జీవరత్నం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద నష్టంపై నివేదించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మహేందర్‌నాథ్

తానూరు/కుంటాల/ముధోల్/లోకేశ్వరం/దస్తురాబాద్: గ్రామాల్లో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నష్టంపై అంచనా వేసి నివేదించాలని తహసీల్దార్లు మహేందర్‌నాథ్, కమల్‌సింగ్, సర్ఫరాజ్ నవాబ్, మండల ప్రత్యేకాధికారులు సుదర్శన్ నాయక్, నాగవర్ధన్ తెలిపారు. ముధోల్ మండల పరిషత్, తానూరు, కుంటాల, లోకేశ్వరం, దస్తురాబాద్ తహసీల్దార్ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలకు పంట నష్టం వివరాలు, రోడ్లు, శిథిలావస్థకు చేరిన పాఠశాల, పంచాయతీ భవనాలు కూలినట్లయితే వివరాలు నమోదు చేయాలన్నారు. శాఖల ఉన్నతాధికారులకు నివేదిక పంపించాలన్నారు. తహసీల్దార్లు శ్రీలత, విశ్వంబర్, ఎంపీడీవోలు శివకుమార్, నసిరొద్దీన్, సోలమాన్‌రాజ్, సునీత, ఎంపీవో రహీంఖాన్, ఎంఈవో చంద్రకాంత్, విద్యుత్ ఏఈ మధు, శివకుమార్, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

భైంసాటౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐయూకేఎస్(అఖిల భారత ఐక్య రైతు సంఘం) జిల్లా ప్రధాన కార్యదర్శి వాగ్మారే మహేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. షేక్ చాంద్ పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ వర్ధంతి



కనకాపూర్‌లో నివాళులర్పిస్తున్న రాంభూపాల్



కుభీర్‌లో..

కడెం/దస్తురాబాద్/లక్ష్మణచాంద/కుభీర్/బాసర: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కడెం మండలం లింగాపూర్‌లో వైఎస్సార్ విగ్రహానికి, లక్ష్మణచాంద మండలం కనకాపూర్, దస్తురాబాద్‌లోని కాంగ్రెస్ కార్యాలయం, కుభీర్, బాసరలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రానికి వైఎస్సార్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జిల్లా అబ్జర్వర్ రాంభూపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దుర్గం మల్లేశ్, రాజేశ్వర్, బషీర్, రమేశ్, మాజీ మండల అధ్యక్షుడు సింగరి కిషన్, నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ఆత్మ చైర్మన్ వివేక్, ఖానాపూర్ ఏఎంసీ మాజీ చైర్మన్ గంగనర్సయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘కాళేశ్వరం’పై కాంగ్రెస్ కుట్ర

- బాదన్‌కుర్తి వంతెనపై బీఆర్‌ఎస్ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు



భైంసాలో నిరసన తెలుపుతున్న నాయకులు

ఖానాపూర్: మాజీ కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ కుట్ర చేస్తోందని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపించారు. మండలంలోని బాదనకుర్తి వంతెన వద్ద మంగళవారం రాస్తారోకో చేపట్టారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ ఆదేశాలతో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన నాయకులు తరలివచ్చి సుమారు అరగంటకు పైగా రాస్తారోకో చేశారు. కాగా, ఆందోళన విషయం తెలుసుకున్న సీఐ అజయ్, ఎస్సై రాహుల్ గైక్వాడ్, పోలీసులు అక్కడికి చేరుకుని వారిని శాంతింపజేశారు. నాయకులు రాజగంగన్న, జీవన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, ఖలీల్, రాజు, శ్రీనివాస్, శ్రావణ్, ప్రదీప్, గోవింద్, గజేందర్, సుమన్, సుమిత్, నరేందర్, సంతోష్, బుచ్చాగౌడ్, నరెందర్, చంద్రహాస్, వెంకటేశ్వర్ రావు, మదు, రాకేశ్, రమణానంద, సోయబ్, మల్లేశ్, శేఖర్, రాజేశ్వర్, దర్మరాజు, మారుతి, బీమేశ్, నాగేశ్, రమేశ్, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నిరసన

భైంసాటౌన్: పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. కాళేశ్వరంపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ విచారణకు వ్యతిరేకంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విలాస్ గాదేవార్, కిరణ్‌కుమార్, లోలం శ్యాంసుందర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రజల పార్టీ

కుంటాల: బీఆర్‌ఎస్ కుటుంబ పార్టీ కాదని ప్రజల పార్టీ అని మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి పేర్కొన్నారు. కల్లూరులో మంగళవారం ఆయన మాట్లాడారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కన్నకూతురు ఎమ్మెల్సీ కవితని కేసీఆర్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. నాయకులు రజినీకాంత్, రమేశ్, వంశీకృష్ణ, ప్రవీణ్, ముకేశ్ ఉన్నారు.

వరద ప్రాంతాల్లో పంటల పరిశీలన



బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

ఖానాపూర్: వరద ప్రభావిత గ్రామాల్లో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని దిలావర్‌పూర్, గోడలపంపు, బావాపూర్(కె) గ్రామాల్లో నష్టపోయిన పంటలను తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రత్నాకర్‌రావులతో కలిసి పరిశీలించారు. గోడలపంపులో రైతులతో కలిసి బైక్‌పై వెళ్లి పంటలను సందర్శించారు. పంట నష్టంపై అధికారులు సర్వే చేపట్టారని త్వరలో రైతులకు పరిహారం అందిస్తామన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కోలాంగూడ పంచాయతీ పరిధి దేవునిగూడెం శివారులో కడెం వాగుపై కొనసాగుతున్న గంగాపూర్ వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట నాయకులు భూషన్, మాజిద్, దయానంద్, రమేశ్, చిన్నం సత్యం, రాజేందర్, గంగాధర్, లక్ష్మీపతిగౌడ్, లక్ష్మీరాజం, రాజేందర్, సుదర్శన్, పెద్దులు, రాజేశ్వర్, సంతోశ్ గౌడ్, మల్లయ్య, రాజన్న, రాజారాం, మల్లేశ్, రాములు, వీరేశ్ ఉన్నారు.

రైతులకు అండగా ఉంటాం

ముధోల్: రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని కేంద్రమాజీ మంత్రి వేణుగోపాలాచారి అన్నారు. ఆష్ట గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అదే విధంగా పుష్కరఘాట్, ఇరిగేషన్ రోడ్డును పరిశీలించారు. అనంతరం గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించగా పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్, గంగారెడ్డి, అనిల్, అశోక్, అజయ్‌రెడ్డి, ముత్యం, భూమేష్, రాములు, శ్రావణ్, విజయ్‌రెడ్డి ఉన్నారు.

సర్దుబాటు ప్రక్రియను పునఃసమీక్షించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నిర్మల్‌రూరల్: జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పునఃసమీక్షించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ కోరారు. మంగళవారం డీఈవో భోజన్నకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం మరోసారి ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడానికి ఈనెల 4 వరకు అవకాశం ఇచ్చినందున, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. అంతకుముందు డీఈవోను సన్మానించారు. నాయకులు భిక్షపతి, బిలావతి లక్ష్మణ్, రాందాస్ నాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లెర్నింగ్ అభ్యసనాలు పెంపొందించాలి

విద్యార్థుల్లో డిజిటల్ లెర్నింగ్ అభ్యసనాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈవో భోజన్న పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ స్కూల్‌లో ‘ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్’ అనే అంశంపై ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఏఎంఓ నరసయ్య, ఏసీజీ ఈ పరమేశ్వర్, ఎంఈవో నాగేశ్వరరావు, కోర్స్ ఇన్‌చార్జి విద్యాసాగర్, డీఎస్వో వినోద్ కుమార్, రిసోర్స్ పర్సన్లు హరిప్రసాద్, కిషన్, ఫయాజ్ కరీం, గంగామోహన్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కడెం: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కడెం/కుభీర్/లక్ష్మణచాంద/సోన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదం కావడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కడెం, కుభీర్‌లోని వివేకానంద చౌరస్తా వద్ద మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ చౌరస్తా వద్ద జరిగిన సంబరాల్లో కాంగ్రెస్ జిల్లా అబ్జర్వర్ రాంభూపాల్, మండల అధ్యక్షుడు రాజేశ్వర్, నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆదేశాలతో సోన్‌లో నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపి సంబురాలు చేసుకున్నారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

తానూరు/కుభీర్/సారంగపూర్/లక్ష్మణచాంద: తానూరు, సారంగపూర్, కుభీర్, లక్ష్మణచాంద ఎంపీడీవో కార్యాలయాల్లో ఓటరు జాబితాలను ప్రదర్శించారు. మొత్తం ఓటర్ల వివరాలను అధికారులు వెల్లడించారు. ఎంపీడీవో నసరొద్దిన్, లక్ష్మీకాంత్‌రావు, సాగర్‌రెడ్డి, రాధ, ఎంపీవో అజీజ్‌ఖాన్, అమీర్‌ఖాన్, తహసీల్దార్ సరిత సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీ బృందానికి సహకరించాలి

లోకేశ్వరం: గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించే బృందానికి సహకరించాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. స్థానిక రైతు వేదికలో డీఆర్పీలు, కార్యదర్శులు, టీఏ, ఏఫ్‌ఏలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ 2024, ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ నిర్వహిస్తామన్నారు. పీఆర్‌ఏఈ గౌరీష్, ఎస్సార్పీ మహేశ్, ఏపీవో అనిల్, టీఏలు మంజూల, శారద, రవీందర్, హరిక పాల్గొన్నారు.

శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీ

సోన్: లెఫ్ట్ పోచంపాడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి ఆధ్వర్యంలో మంగళవారం శానిటరీ న్యాప్కిన్లు పంపిణీ చేశారు. దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా వీటిని అందించినట్లు తెలిపారు. నాయకులు రేఖ, వాసవి, గీత పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

పెంబి: మండలంలోని వేణునగర్‌లో ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గ్రంథాలయాన్ని ఎంఈవో రాంచందర్ ప్రారంభించారు. ఉపాధ్యాయులు గంగాధర్, శంకర్, పద్మావతి, సీఆర్‌టీ విఠల్, విద్యార్థులు ఉన్నారు.

భవనాలు పరిశీలన

ఖానాపూర్: సోలార్ పవర్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో పట్టణంలోని పలు భవనాలను మున్సిపల్ సిబ్బంది మంగళవారం పరిశీలించారు. కమిషనర్ సుందర్ సింగ్ సూచనతో భవనాల కొలతలు ఇతర వివరాలను సేకరించినట్లు సిబ్బంది రమేశ్, దీరజ్ తెలిపారు.